
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

JUNE-2012

సంవత్సర చందా రూ.50/-

## క్రీస్తు సంఘములు సమర్పించు
## సత్యవాణి టి.వి. ప్రసారములు

ప్రతి ఆదివారం సాయంత్రం 6.00 గం॥లకు శుభవార్త

ప్రతి బుధవారం సాయంత్రం 6.30 ని॥లకు రక్షణ

ప్రతి గురువారం మధ్యాహ్నం 2.30 ని॥లకు రక్షణ

ప్రతి శనివారం ఉదయం 8.00 గం॥లకు ఆరాధన

ఛానల్‌లలో వీక్షించండి.

ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సులో చేరండి. ఆ కోర్సు పూర్తిచేసి ఒక బైబిలును ఉచితముగా బహుమతి పొందండి. ఈ రోజే మాకు వ్రాయండి. మీ ఇరుగుపొరుగు వారు కూడా ఈ కోర్సు చేయవచ్చును.

మా అడ్రస్

**సత్యవాణి**

**పో.బాక్స్ నెం. 80,**

**కాకినాడ. ఎ.పి.**

**533 001.**

**ఫోన్ : 0884 - 2363722**

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 32 | జూన్ - 2012 | సంచిక - 11


## పరిశుద్ధాత్మబాప్తిస్మము
(Baptism of the Holy Spirit)

పరిశుద్ధాత్ముని గూర్చియు, ఆయన చేయు పనిని గూర్చియు నేటి క్రైస్తవ లోకములో అనేక సిద్ధాంతములున్నవి. పరిశుద్ధాత్ముని వ్యక్తిత్వమును గూర్చియు, దైవత్వమును గూర్చియు మనము ఇదివరకే కొంత తెలిసికొని యున్నాము. అయితే క్రొత్త నిబంధనలో మనకు కన్పడు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి ఈ రోజు దైవ వేదము నుండి కొన్ని సత్యములను గ్రహించుకొందము. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి క్రైస్తవలోకములో ఎక్కువ గందరగోళ మున్నదని మనమెరిగిన సంగతియే. ఒకడు రక్షింపబడవలెనంటే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందవలెనని కొందరు బోధింతురు అయితే ఈ అంశమును గూర్చి బైబిలు ఏమి బోధించుచున్నది? పరిశుద్ధాత్మ బాప్తిస్మము నేటికింకను ఉన్నదా? వీటిని గూర్చి కొంత తెలిసి కొందము.

క్రొత్తనిబంధనలో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి బాప్తిస్మమిచ్చు యోహాను మత్తయి 3:11లో మొట్ట

మొదటిగ ప్రకటించెను. అతడిట్లనెను: "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చు చున్నాను; అయితే నా వెనుక వచ్చువాడు నాకంటె శక్తిమంతుడు ; ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను ; ఆయన పరిశుద్ధాత్మతోను, అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును." యోహాను చెప్పిన ఈ మాటలను బట్టి యేసు క్రీస్తు మాత్రమే పరిశుద్ధాత్మలో బాప్తిస్మమిచ్చు వాడని మనకు అర్థమగుచున్నది. పరిశుద్ధాత్మ బాప్తిస్మము మానవునిచే ఇయ్యబడు బాప్తిస్మము కాదు. అది దేవునిచే చేయబడిన వాగ్దానమేగాని ఆయన యిచ్చిన ఆజ్ఞ కాదు అని మనము గ్రహించవలెను.

బాప్తిస్మమిచ్చు యోహాను పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి చెప్పిన ఆ మాటల తరువాత అపొ.కా. 1:5 వరకు దానిని గూర్చి మరల ఎక్కడ చెప్పబడలేదు. యేసు క్రీస్తు చనిపోయి సమాధి చేయబడి మూడవ దినమున తిరిగి లేచెను. అటు తరువాత నలువది దినముల వరకు ఆయన తాను ఏర్పరచుకొనిన అపొస్తలులకు అగుపడుచు దేవుని రాజ్య విషయములను గూర్చి బోధించుచు, అనేక ప్రమాణములను చూపి వారికి తన్ను తాను సజీవునిగా కనపరచుకొనెను. ఆయన వారిని కలసికొని యీలాగు ఆజ్ఞాపించెను... మీరు యెరూషలేము నుండి వెళ్ళక, నావలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి; యోహాను నీళ్ళతో బాప్తిస్మము ఇచ్చెను గాని కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరనెను (అపొ.కా. 1:1-5). ఈ 5 వచనములను మనము జాగ్రత్తగా పరిశీలించిన యెడల పరిశుద్ధాత్మ బాప్తిస్మము అపొస్తలులకు మాత్రమే వాగ్దానము చేయబడినట్లు గమనించగలము. ఆయన అపొస్తలులను సంబోధిస్తూ 'నావలన వినిన తండ్రి యొక్క వాగ్దానము కొరకు కనిపెట్టుడి' యని చెప్పి, ఆ వాగ్దానమే పరిశుద్ధాత్మ బాప్తిస్మము అని ఆయన వారికి సూచించెను. గనుక ఈ వాగ్దానము అపొస్తలులకు తప్ప మరెవరికిని చేయబడలేదు. అందువలన అపొస్తలులు తప్ప మరెవరును పరిశుద్ధాత్మ బాప్తిస్మము కొరకు ఎదురుచూడనవుసరవలేదు. ఏలయనగా అది మరెవరికి వాగ్దానము చేయబడలేదు.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి క్రీస్తు అపొస్తలులను హెచ్చరించక ముందు, పరిశుద్ధాత్ముని గూర్చి వారికి అనేక వాగ్దానములు చేసెను. "ఆదరణ కర్త అనగా తండ్రి నా నామమున పంపబోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకముచేయును" అని యోహాను 14:26లో వారితో చెప్పెను. మరల "నేను మీతో చెప్పవలసినవి

ఇంకను అనేక సంగతులు కలవు. అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు మిమ్మును సర్వసత్యము లోనికి నడిపించును; ఆయన తనంతట తానే యేమియు బోధింపక, వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను మీకు తెలియజేయును" అని యోహాను 16:12-14 వచనము లలో ఆయన వారికి వాగ్దానము చేసెను. అట్లే మార్కు 16:17-20 లో అపొస్తలు లకు చేయబడిన వాగ్దానమును కూడ దయచేసి చదువండి.

మనము చదివిన ఈ వచన ముల వలన అపొస్తలులకు వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ బాప్తిస్మము యొక్క ప్రయోజనమేమిటో గ్రహించుకొన గలము: అది రెండు విధములుగనున్నది. మొదటిగా... క్రీస్తు సువార్తను బోధించు టలోను క్రొత్తనిబంధనను వ్రాయుటలోను అపొస్తలులు పొరపాట్లు చేయకుండు నట్లును, సర్వసత్యమును దైవావేశము వలన వారు బోధించి, లిఖించగల్గు నట్లును పరిశుద్ధాత్మ బాప్తిస్మము వారికీయ బడెను. రెండవదిగా, వారు దేవునిచే పంపబడినవారని, వారు బోధించు వాక్యము దైవ వాక్యమని నిరూపించుటకు వారికి అద్భుతములు, సూచక క్రియలు చేయుశక్తి నిచ్చుటకు పరిశుద్ధాత్మ బాప్తిస్మ ము వారికీయబడెను. (మార్కు 16:20).

యేసు అపొస్తలులకు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చి చేసిన వాగ్దానము అపొ.కా. 2వ అధ్యాయములో నెరవేరెను. పెంతెకోస్తు అను పండుగ దినమున యెరూషలేములో అపొస్తలులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి. అపొ.కా. 2:1-4 లో దానిని గూర్చి ఇప్పుడు చదువు కొందము : "పెంతెకొస్తను పండుగ దినము వచ్చినప్పుడు (అపొస్తలులు) అందరు ఒక చోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొక ధ్వని అకాశమునుండి అకస్మాత్తుగా, వారు కూర్చుండియున్న యిల్లంతయునిండెను. మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్లుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కని మీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అన్యభాష లతో మాటలాడసాగిరి ".

అపొ.కా. 1:15లో చెప్పబడిన 120 మంది శిష్యులు పెంతెకొస్తునాడు పరిశు ద్ధాత్మ బాప్తిస్మమును పొందిరియని కొందరు తలంచెదరు. అయితే మొదటి అధ్యాయము ఆఖరి వచనములో మనము చూచిన యెడల ఇస్కరియోతు యూదా స్థానమును భర్తీచేయు నిమిత్తము మత్తీయ అనునతడు అపొస్తలుడుగా ఏర్పరచబడినట్లును, అతడు మిగిలిన పదునొకండు మంది అపొస్తలు లతో లెక్కింపబడినట్లును మనము చూడ

గలము. అపొ.కా. 2వ అధ్యాయము ఈ 12 మంది ఒక చోట కూడి యుండుటతో ఆరంభమగుచున్నది. అంతే గాక అపొ.కా. 1:5 లో పరిశుద్ధాత్మ బాప్తిస్మమును యేసు తన అపొస్తలులకే వాగ్దానము చేసినట్లును, ఆదరణకర్తను గూర్చియు సత్య స్వరూపి యైన ఆత్మను గూర్చియు అట్టి వాగ్దానము లను యేసు తన అపొస్తలులకే చేసినట్లును మనము ఇంతకుముందే గమనించితిమి. అటు తరువాత పరిశుద్ధాత్మ శక్తి వలన అపొస్తులులు వేర్వేరు భాషలతో మాట లాడుట ప్రజలు చూచి, విభ్రాంతినొంది యెటుతోచక యిదే మగునోయని ఒకనితో ఒకడు చెప్పుకొను చుండగా పేతురు ఆ పదునొకరితో కూడ లేచి నిలిచి బిగ్గరగా వారికి క్రీస్తును గూర్చిన మొదటి సువార్త ప్రసంగ మును చేసెను (అపొ.కా. 2:12-14). దీనిని బట్టి దేవుడు అద్భుత రీతిగా తన అపొస్తలులను ప్రత్యేకపరిచి వారికి పరిశుద్ధాత్మ బాప్తిస్మమునిచ్చి వారిని సర్వసత్యము లోనికినడిపించెను.

అపొస్తలులు పెంతెకోస్తునాడు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందగా జరిగిన సంగతులను గమనించుము. అపుడు వేగముగా వీచు బలమైన గాలి వంటి ధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా వచ్చెను. దానితో వారు కూర్చున్న యిల్లం తయునిండెను. మరియు అగ్నిజ్వాల లవంటి నాలుకలు వారిలో ఒక్కొక్కనిమీద వ్రాలెను. అపుడు అపొస్తలులందరు పరిశుద్ధాత్మతో నిండినవారై అన్యభాషలతో మాటలాడసాగిరి. ఈనాడు పరిశుద్ధాత్మ బాప్తిస్మము ఉన్నదని బోధించువారు ఈ సూచనలన్నిటిని చూపించగలరా? అట్టి వేమియు చేయలేరని మన మెరుగుదుము.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమునుపొంది పేతురు మొట్టమొదటి సువార్త ప్రసం గమును చేయుచు, ప్రవక్తయైన యోవేలు ద్వారా చెప్పబడిన సంగతి అప్పుడు నెర వేరెనని ప్రజలకు తెలియజేసెను. "అంత్య దినములయందు నేను మనుష్యులందరి మీదను నా అత్మను కుమ్మరించెదను" అని యోవేలు ప్రవచించెను (యోవేలు 2:28-32; అపొ.కా. 2:17). 'మనుష్య లందరి మీదను' అని చెప్పబడినప్పుడు అది యూదులకు అన్యజనులకును అని యర్థము. అయితే పెంతెకోస్తునాడు కేవలము యూదులే, అనగా అపొస్తలులే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిరి గనుక అన్యజనులుకూడ పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుట అప్పటికింకను జరుగలేదు. అయితే అపొస్తలులకార్య ములు 10వ అధ్యాయమును మనము చదివిన యెడల అన్యజనుడైన కొర్నేలీయు, తన యింటి వారును పరిశుద్ధాత్మ బాప్తి స్మము పొందుట మనము గమనించ గలము (అపొ.కా. 10:34; 11:18).

క్రొత్త నిబంధనలో ఈ రెండు

సందర్భములలోనే, అనగా పెంతెకోస్తు నాడు అపొస్తలులును, అపొ.కా. 10వ అధ్యాయ ములో కొర్నేలి యింటివారును మాత్రమే తప్పమరెవరును పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందినట్లు మనకు అగు పడదు. కొర్నేలి యింటివారు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన సందర్భమును గూర్చి వచ్చే పాఠములో తెలిసికొంద ము. ఈలోగా ఈ అంశము పై క్రొత్త నిబంధనను మీరు దీర్ఘముగ పఠించ వలెనని కోరుచున్నాను.

## దేవుడు మన పరలోక తండ్రి
## ( God is our Heavenly Father)

పరమందొక దేవుడున్నాడు! ఆయన ఎట్లుంటారు? ఆయన మన తండ్రి. దేవుడు ఆదామును చేసినప్పుడు "వాని నాసికారంధ్రములలో జీవవాయు వును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను" (ఆది.కా. 2:7). మనుష్యుల అంతరంగము లో జీవాత్మను సృజించినవాడు యెహో వాయని జెకర్యా 12:1 చెప్పుచున్నది. గనుక ఒక శిశువు గర్భమునందు పడిన ప్పుడెల్లా దేవుడొక నూతన ఆత్మను సృజిం చుచున్నారు. "నాతండ్రి యిదివరకు పనిచేయుచున్నాడు, నేనునుచేయుచు న్నానని" యేసు చెప్పెను (యోహాను 5:17). మానవుడు చనిపోయినపుడు వాని ఆత్మ దానిదయ చేసిన దేవుని యొద్దకు పోవును (ప్రసంగి 12:7). తండ్రి ఆకాశ మునకును భూమికిని ప్రభువైయున్నాడని యేసు అట్లు ఆయనను సంబోధించెను (మత్తయి 11:25). "యెహోవా, నీవే మాకు తండ్రివి, మేము జిగటమన్ను, నీవుమాకు కుమ్మరివాడవు. మేమందరము నీచేతిపనియై యున్నాము" అని యెషయా 64:8 చెప్పుచున్నది. దేవుడు మనలను చేసినం దున ఆయన ఈలోకమందున్న ఆత్మలన్ని టికి తండ్రియే. ఆయన అందరికీ ఆత్మనను గ్రహించి యున్నాడు గనుక వారు మంచి వారైనను, చెడ్డవారైనను ఆయన వారి ఆత్మలకు తండ్రి. "మనుష్యులందరు నావశములో యున్నారు" అని ఆయన యెహెజ్కేలు 18:4లో చెప్పెను. "మీరు జీవముగల దేవుని కుమారులై యున్నా రని" హోషేయ 1:10 చెప్పుచున్నది.

**ఊపిరి గలప్రతి ఆత్మకు దేవుడు తండ్రి :**

దేవుడు నిత్యుడగు తండ్రియని పిలువబడ్డారు (యెషయా 9:7). పరలోకమందున్న మా తండ్రీయని, పరలోకమందున్న తండ్రియని (మత్తయి 15:13), పరిశుద్ధుడవైన తండ్రియని (యోహాను 17:11), నా తండ్రియు మీతండ్రియు యని (యోహాను 20:17).

అందరికి తండ్రియై యుండి అందరికి పైగా యుండి అందరిలోను వ్యాపించి యున్నాడని చెప్పబడినది (ఎఫెసీ 4:6). ఆయన మన ప్రభువగు యేసుక్రీస్తు యొక్క తండ్రియని (ఎఫెసీ 1:3), మహిమ గల తండ్రియని (ఎఫెసీ 1:17), జ్యోతిర్మయుడగు తండ్రియని (యాకోబు 1:17), కనికరము చూపుతండ్రియని (2 కొరింథీ 1:3), చెప్పబడినది. ఈ లేఖనములను బట్టి ఊపిరిగల ప్రతి ఆత్మకు దేవుడు తండ్రియై యున్నారని మనం గ్రహించుకోవచ్చును. ఆయన మనలను సృజించారు. "మీరందరు సర్వోన్నతుని కుమారులని" కీర్తన 82:6 చెప్పుచున్నది. "మీరు మీదేవుడైన యెహోవా బిడ్డలు" అని ద్వితీ 14: 1 చెప్పుచున్నది.

**మానవుడు పాపము చేయగా దేవుడిక అతని తండ్రిగా యుండరు:**

ఒకడు తప్పుచేసినప్పుడు, పాపము చేసినప్పుడు దేవుడిక అతని తండ్రిగా యుండరు. అందు వలననే యోహాను 8 :44లో క్రీస్తు "మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీతండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆది నుండి వాడునరహంతకుడై యుండి సత్యమందు నిలిచిన వాడుకాదు; వాని యందు సత్యమే లేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియేమాటలాడును; వాడు అబద్ధికుడును, అబద్ధమునకు జనకుడునై యున్నాడని" చెప్పెను.

దేవుని ఉగ్రత అవిధేయులైన కుమారుల మీదికి వచ్చునని ఎఫెసీ5:6 చెప్పుచున్నది. ఉగ్రతకు పాత్రులైన పిల్లలను గూర్చి ఎఫెసీ 2:3 చెప్పుచున్నది. దుష్టుని సంబంధులు లేక దుష్టుని కుమారులను గూర్చి మత్తయి 13:38 చెప్పుచున్నది. 1 యోహాను 3:8-10 ఇట్లు చెప్పుచున్నది: "అపవాది మొదటి నుండి పాపము చేయుచున్నాడు గనుక పాపము చేయువాడు అపవాది సంబంధి. అపవాదియొక్క క్రియలను లయపరచుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను. దేవుని మూలముగా పుట్టిన ప్రతివానిలో ఆయన బీజము నిలుచును గనుక వాడు పాపము చేయడు; వాడు దేవుని మూలముగా పుట్టినవాడు గనుక పాపము చేయజాలడు. దీనిని బట్టి దేవునిపిల్ల లెవరో అపవాది పిల్లలెవరో తేటపడును. నీతిని జరిగించని ప్రతివాడును, తన సహోదరుని ప్రేమింపని ప్రతివాడును దేవుని సంబంధులుకారు. ఎలుమ అనునతడు సమస్తకపటము తోను, సమస్త దుర్మార్గము తోను నిండిన వాడని, అపవాది కుమారుడని, నీతి విరోధియని అపో.పౌలు అతనికి చెప్పెను (అపో.కా. 13:10).

**పాపముచేయువారు అపవాది కుమారులు :**

అపవాదియున్నాడని పాపము

చేయువారు అతని సంబంధులుగుదురని మనం తెలిసికోవాలి. అందు వలన ఈ లోకంలో యున్న దుర్మార్గతను గూర్చి మనం దేవుని నిందించరాదు. ఈ లోకంలో అపవాది యొక్క శక్తి పరిమితి గలదే. సమస్త దుర్మార్గతకు వాడే కారకుడు. ఒకానొక దినమందు అపవాదిని వాని క్రియలను దేవుడే సమూలంగానాశనం చేసి నీతిమంతులను పరలోకం తీసికొని వెళ్లును. అక్కడ వారు శోధింపబడరు. గాని అప్పటి వరకు సజ్జనులు అపవాదిని ఎదిరించాలి. దేవుని సేవ చేయాలి. సాతానుకొక రాజ్యమున్నది (మార్కు 3:24). ఒకడు అపవాదిని ఎదిరించి క్రీస్తులోనికి బాప్తిస్మముపొందినప్పుడు, అతడు అంధకారసంబంధమైన రాజ్యము నుండి విడుదలపొంది దేవుని రాజ్యములో జన్మించిన వాడగుతాడు (కొలస్స 1:13).

**తిరిగి జన్మించిన వారు ఇష్టపూర్వ కముగా దేవుని బిడ్డలైనవారు:**

ఒకడు తిరిగిజన్మించి ఇష్టపూర్వ కముగా దేవుని బిడ్డ అయినప్పుడు అతడు దేవునితో ఆశ్చర్యకరమైన సంబంధము కలిగియుండును. ఈ క్రొత్తజన్మ ప్రకృతి జన్మకాదు. గాని ఆత్మీయమైనది. దేవుడట్టి వానిని ఊహించనిరీతిగా దీవించును. దేవుడు మన హృదయము లోనికి తన ఆత్మను పంపుట ద్వారా మనం నాయనా, తండ్రీ అని ఆయనకు మొర్ర పెట్టుదుము (గలతీ 4:6). ఆయన "నిత్యమైన ఆదరణయు, శుభనిరీక్షణయు మనకను గ్రహించును" (2 థెస్స 2:16). దేవుడు అన్నిటికంటె, అందరికంటె గొప్పవాడు గనుక ఎవడును ఆయన నుండి మనలను అపహరింపలేడు (యోహా ను 10:29,30). దేవుడు మనలను ముద్రవేసి యున్నారు (యోహాను 6:27). గనుక ఆయనమనకు నిజమైన ఆహారమునను గ్రహించును (యోహాను 6:32). "నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించు వాడు; నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమింపబడును అని యేసు చెప్పెను (యోహాను 14:21). మరల "ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నామాట గైకొనును, అప్పుడు నాతండ్రి వానిని ప్రేమించును, మేము వాని యొద్దకు వచ్చి నివాసము చేతుమని" ఆయన చెప్పెను (యోహాను 14:23).

**నీతిమంతులను దేవుడు ప్రత్యే కముగా ప్రేమించును :**

ఆయనను ప్రేమించి ఆయన ఆజ్ఞలను గైకొనువారిని దేవుడు ప్రత్యే కముగా ప్రేమించునని ఈలేఖనముల వలన తెలిసి కొనుచున్నాము. అందు వలన పాతనిబంధనలో తన ప్రజలను గూర్చి దేవుడు "ఇశ్రాయేలు నాకుమారుడు, నాజ్యేష్ఠ పుత్రుడు." "నేనతనికి తండ్రినై యుందును" అని పలికెను (నిర్గమ 4: 22; 1 దినవృ

28:6). అందుకే దావీదు, "మాకు తండ్రిగా నున్న ఇశ్రాయేలీయుల దేవా యెహోవా, నీవు నిరంతరము స్తోత్రార్హుడవు" అని పలికెను (1 దినవృ 29:10). దేవుడు తండ్రి లేని వారికి తండ్రి యని కూడ అతడు చెప్పాడు (కీర్తన 68:5).

**దేవుడు క్రీస్తు ఏకమై యున్నారు :**

క్రీస్తు ఈలోకములో యుండగా దేవునితో ఆయన సత్సంబంధమును కలిగి యుండెను. దేవుడు మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రియని చెప్పెను (1పేతురు 1:2). "నేనును తండ్రియు ఏకమై యున్నామని" ఆయన చెప్పెను (యోహాను 10:30). నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడని కూడ ఆయన చెప్పెను (యోహాను 14:10). ఆయన తండ్రి యొద్దనుండి బయలుదేరి లోకమునకు వచ్చియున్నాడని మరియు లోకమును విడిచి తండ్రియొద్దకు వెళ్లుచున్నానని ప్రకటించెను (యోహాను 16:28). నేను తండ్రియందును, తండ్రి నాయందును నిలిచి యున్నారని ఆయన చెప్పెను (యోహాను 14:10). దేవుడు సమస్తాన్ని ఆయన చేతికి అప్పగించెను (యోహాను 13:3). దేవుడు అందరిలోను, అన్నిటిలోను యుండునట్లు ఆయన అంతము వరకు రాజ్యపాలన చేసి రాజ్యమును తండ్రికి అప్పగించును (1 కొరింథీ 15:24). నాద్వారానే తప్ప తండ్రి యొద్దకు ఎవడును రాడు అని ఆయన చెప్పెను (యోహాను 14:6). "ఒకడు నన్ను సేవిం చిన యెడల నా తండ్రి అతని ఘనపర చును". "మీరు బహుగా ఫలించుట వలన నాతండ్రి మహిమపరచబడును" అని ఆయన చెప్పెను (యోహాను 12:26; 15:8). "నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేని యెడల మీతో చెప్పుదును. మీకు స్థలము సిద్ధపరచ వెళ్లుచున్నాను, నేను వెళ్లి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" అని ఆయన వాగ్దానము చేసెను (యోహాను 14:2-3).

**ఎదుగునిమిత్తము దేవుడు మనకు సమయమిచ్చును:**

దేవుడు మన తండ్రి గనుక ఆయన నెమ్మదిగా, ఓర్పుతోమనలను నీతిమార్గమున నడిపించును. తండ్రి బలవంతముగా తన పిల్లలను ఎదుగ జేయలేడు గాని పెరుగుటకు వారికి సమయమిచ్చును. వారిపని అంతా అతడు చేయడు, వారి కష్టాలన్నీ తీసేయడు. గనుక మన బాధలను, కష్టాలను నివారించుటకు దేవుడు నేరుగా మన పక్షమున పని చేయుట లేదని అనుకొన రాదు. దేవునికి యేమీ తొందర లేదు. గాని వీటన్నిటి ద్వారా

మన తరుణాలను, పరిమితులను మనం తెలిసికొని సహాయార్థం ఆయన యొద్దకు వచ్చునట్లు చేయును. ఆయన పట్టించుకోడని లేక నిద్రించుచున్నాడని దీని యర్థంకాదు. "ఆయన యందు మనం బ్రదుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగి యున్నాము" (అపో.కా. 17:28). ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి యున్నాడు (ఎఫెసీ 4:6).

"ఆకాశపక్షులను చూడుడి; అవి విత్తవు కోయవు కొట్లలో కూర్చు కొనవు. అయినను మీపరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు; మీరు వాటికంటె బహు శ్రేష్ఠులు కారా? "యని యేసు బోధించారు (మత్తయి 6:26).

**దేవుడుమన యొద్దకు పరుగెత్తును :**

దేవుడు తొందరపడి మన యొద్దకు పరుగెత్తుచున్నట్లు బైబిలు బోధించుచున్నది. తప్పిపోయిన కుమారుని గూర్చిన కథనమును యేసు చెప్పారు (లూకా 15:11-32). అతడు తన తండ్రి ఆస్థిని దుర్వ్యాపారము వలన పాడు చేసి చివరకు పందుల దొడ్డిలో బుద్ధి తెచ్చుకొనెను. అతడు తన తండ్రి యొద్దకు తిరిగి వెళ్లి క్షమాపణనడుగుదామనుకొంటాడు. అయితే అతడు ఇంకా దూరముననుండగా తండ్రి అతని చూచి పరుగెత్తుకొని వెళ్లి మెడమీద పడి ముద్దు పెట్టుకొని, నూతన వస్త్రములు అతనికి ధరింపజేసి గొప్ప విందు చేసెను. ఏలయనగా ఈనాకుమారుడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరికెనని చెప్పెను. "అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబది తొమ్మిది నీతి మంతుల విషయమై కలుగు సంతోషము కంటె మారుమనస్సు పొందు ఒక్కపాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగునని" యేసు చెప్పెను (లూకా (15:7).

**పాపముచేయు వారి యెడల దేవుడు ఆసక్తికలిగియున్నారు:**

నీతిమంతుల యెడల దేవుడు తండ్రివలె ప్రేమకలిగి యున్నను పాపము చేయువారి యెడల కూడ వారు ఆయన యొద్దకు తిరిగి వచ్చులాగున ఆసక్తి కలిగి యున్నారు. యిర్మియా 3:12-14 ఇట్లు చెప్పుచున్నది. " భ్రష్టులగు పిల్లలారా, తిరిగి రండి, నేను మీ యజమానుడను ఇదే యెహోవా వాక్కు" ;"మీమీద నాకోపము పడనీ యను, నేనుకృప గలవాడను గనుక నేనెల్ల ప్పుడు కోపించువాడను కాను, ఇదే యెహోవా వాక్కు. నీదేవుడైన యెహోవా మీద తిరుగుబాటు చేయుచు, నా మాటను అంగీకరింపక ప్రతి పచ్చని చెట్టుక్రింద అన్యులతో కలిసికొనుటకు నీవు ఇటు అటుపోయి నీదోషము ఒప్పుకొనుము, ఇదే యెహోవావాక్కు".

# సంఘ ఆర్థికం
## ( Finances of the Church)

**సంఘమునకు ఆర్థిక సహాయము ఎక్కడనుండి వచ్చును?** సంఘము మిగతా మత సంస్థలన్నిటికంటే వేరైన సంస్థ గనుక ఇది సరియైన ప్రశ్నయే. మిగిలిన సంస్థలవలె ఆర్థిక సహాయము కొరకు సంఘము మామూలు స్థలములలో వెదుకరాదు. ఉదాహరణకు సంఘము ప్రభుత్వమునుండి ఆర్థిక సహాయము కొరకు ఎదురుచూడరాదు. డబ్బును పోగుచేసే సభలు అది నడిపించరాదు. సభ్యులు, సభ్యులు కానివారు కూడా చందాలియ్యవలసినదని అది అట్టి సభలలో ఒత్తిడి చేయరాదు. ప్రత్యేక వస్తువులను అమ్ముటద్వారా గాని లాటరీ టిక్కెట్లు అమ్ముట ద్వారా గాని అది డబ్బును పోగు చేయరాదు. అది ఇతర మత సంస్థలతో సహవాసము కలిగి యుండదు గనుక సహాయము కొరకు వాటిని అభ్యర్థించ లేదు. అట్లయిన సంఘమునకు ఆర్థికముగ సహాయము ఎక్కడనుండి వచ్చును? ఈ సంగతిని లేఖనములు అతి సులభముగా విపులముగా మనకు జవాబిచ్చుట మనము చూడగలము.

క్రీస్తు సంఘము అనేక స్థానిక సంఘములతో సమకూడియున్నది. ప్రతి స్థానిక సంఘము పెద్దలను, పరిచారకులను, బోధకులను, ఉపదేశకులను, సభ్యులను కలిగియున్నది. ప్రతి స్థానిక సంఘము తన విధులను, బాధ్యతలను, అవసరతలను, పనిని కలిగియున్నది. ప్రతి స్థానిక సంఘము మిగిలిన స్థానిక సంఘముల నుండి స్వతంత్రత కలిగియున్నందున, దేని ఆర్థికావసరములను అదే తీర్చుకొనవలెను. అంటే క్రీస్తు సంఘమునకు ప్రపంచమందు ఒక ముఖ్య కేంద్రమ్ముగాని, ముఖ్యాధికారిగాన్ని, ఆర్గనైజేషన్‌గాని లేదు. అందువలన ఒక స్థానిక సంఘము సహాయము కొరకు ఒక సర్వజనాధికారిని అభ్యర్థించవలసిన పని లేదు. ఒక స్థానిక సంఘము చిన్నదై యుండి, అవసరతతో యున్న యెడల, దాని అవసరములలో సహాయపడు నిమిత్తము మరికొన్ని స్థానిక సంఘములు దానితో సహవాసము కలిగియుండవచ్చును. సంఘములు అట్లు సహాయపడవలెనని నిర్బంధము ఏమియు లేదు. గనుక ప్రతి స్థానిక క్రీస్తు సంఘము అది చిన్న దేమి, పెద్దదేమి తన ఆర్థికావసరములను తానే తీర్చుకొనవలెను.

ప్రతి స్థానిక సంఘము వ్యక్తిగత

క్రైస్తవులతో సమకూడియున్నది. అయితే ప్రతివారును కానుకల నీయవలసినదని ప్రభువు ఆజ్ఞాపించెను. కొరింధులోనున్న స్థానిక సంఘమునకు పౌలు ఇట్లు వ్రాసెను: "పరిశుద్ధులకొరకైన చందా విషయమైతే నేను గలతీయ సంఘములకు నియమించిన ప్రకారము మీరును చేయుడి. నేను వచ్చినప్పుడు చందాపోగు చేయకుండా ప్రతి ఆదివారమున మీలో ప్రతివాడును తాను వర్ధిల్లినకొలది తన యొద్ద కొంత సొమ్ము నిలువచేయవలెను" (1 కొరింధి 16:1–2). వారికి మరల అతడు ఇట్లు వ్రాసెను: "సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ప్రతివాడును తన హృదయములో నిశ్చయించుకొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చువానిని ప్రేమించును" (2 కొరింధి 9:7). సంఘసభ్యులు చందా నిచ్చుటకు, స్థానిక సంఘమునకు ఆర్థికముగా సహాయపడుటకు ఈ వచనములలో వారు పాటించవలసిన కొన్ని నియమములను అతడు వ్రాసెను. దయ చేసి వాటిని గమనించుము:

1. వారు ప్రతి ఆదివారమున చందా నీయవలెను. అది వారు ఆరాధనకు కూడుకొనిన దినము (అపొ.కా. 20:7). అందువలన తమ సొమ్మును తీసుకొని వచ్చుటకు అది చాల అనుకూల దినము.

2. ఇచ్చుటలో ప్రతివారు పాలుపొందవలెను. వారు తమ ధనమును గాని, ధాన్యము గాని లేక మరి యేదయిననుగాని ఇయ్యవచ్చును. ఇచ్చునది సంఘమునకు ఉపయోగకరముగాను, ఇచ్చువానికి అనుకూలమైనదిగాను ఉన్నదానిని ఇయ్యవచ్చును.

3. క్రైస్తవుడు తాను వర్ధిల్లినకొలది ఇయ్యవలెను. వారు ఎక్కువ డబ్బును సంపాదించిన యెడల ఎక్కువ చందా నీయవలెను. వారు ఒక వారములో ఏమియు సంపాదించలేని యెడల ఆ వారములో ఇయ్యనవుసరము లేదు. అయితే వారు సంపాదించినదానిలో ఎంతభాగము ఇయ్యవలెను ? ఇంతియ్యవలెనని నేను చెప్పజాలను. అది వ్యక్తిగతముగా నిర్ణయించుకొనవలెను. బైబిలు బోధించు రీతిగ యిచ్చు ప్రతివారు ఎంత నియ్యవలెనో ఎరిగియేయుందురు. యూదులు తమ ఆదాయములో దశమ భాగమును యిచ్చెడివారు. గాని మనము వారి కంటె శ్రేష్ఠమైన చట్టము క్రింద యున్నాము. వారికంటె ఎక్కువ యిచ్చు టకుమనము ప్రోత్సహించబడవలెను.

4. వారు ఇవ్వవలసినరీతిగా ఆదివారమున ఇచ్చిన యెడల అవసరము వచ్చు సరికి స్థానిక సంఘములో డబ్బు ఉండును. ఈరీతిగా కానుకలు ఇయ్యని యెడల దేవుని పని జరుగుటకు అభ్యం

తరము కలుగును.

5. ప్రతివాదును తన హృదయములో నిశ్చయించుకొనిరీతిగ ఇయ్యవలెను. దీనినిబట్టి ఒకడు ఇచ్చుటకు ముందు ఎంత ఇయ్యవలెనో నిశ్చయించుకొని ఇయ్యవలెను. ఎంత ఇయ్యవలెనో ఆలోచించకుండగ చందా ఎత్తు సమయమున జేబులో చెయ్యి పెట్టి చేతికి దొరికిన నాణెమును ఏదో ఇచ్చిన యెడల అతడు ఇయ్యవలసినంత దేవునికి ఇయ్యక పోవును. లేఖనముల ప్రకారము మనము ఇయ్యవలెనన్న ముందుగనే ఆలోచించుకొని ఇయ్యవలెను.

6. ఒకడు సణుగుకొనకయు, బలవంతముగా కాకయు ఇయ్యవలెను. ఎవరో బలవంతము చేయుట వలన ఒకడు ఇయ్యరాదు గాని అతనికి ఇయ్యవలెనని మనస్సున్నది గనుక మనస్ఫూర్తిగా ఇయ్యవలెను.

7. ఇచ్చు ప్రతి కానుకయు సంతోషముతో ఇయ్యవలెను. అతడు దేవునిచే ఆశీర్వదించబడియున్నందున దేవునికి కానుకల నిచ్చుటకు అతడు సంతోషించుచు కృతజ్ఞత కలిగియుండ వలెను.

సంఘసభ్యులు ఈ రీతిగా ఈయవలెను. స్థానిక సంఘమునకు ఆర్థిక సహాయము ఈ విధముగా లభించును. దేవుడు తన పని నిమిత్తము ధన సహాయము అందించు విధానము వేరొకటి లేదు. సంఘసభ్యులు తమ ఇష్టపూ కముగా యిచ్చిన కానుకలపై సంఘమ ఆధారపడి యున్నది. ఒకడు సం సభ్యుడు కాగానే, సంఘము తన పని నిర్వర్తించునట్లు సంఘమునకు ఆర్థి ముగా సహాయము చేయు బాధ్యతన స్వీకరించును.

సభ్యులు ఇచ్చిన తరువాత ఆ సొమ్మును దేవుని సేవ నిమిత్తమే జ్ఞా యుక్తముగా వినియోగించు బాధ్యతన సంఘము కలిగియున్నది. ఆ సొమ్మున సంఘము ప్రాముఖ్యముగా సువార్తన బోధించుటకును, ఆపదలో యున్న వారి సహాయము చేయుటకును వినియో గించవలెను. స్థానిక సంఘము తన యొద్ద నున్న సొమ్ములో ఎక్కువ భాగమ ను తన యొక్క భౌతికావుసరము నిమిత్తము వినియోగించకుండా జాగ్రత్త పడవలెను.

సభ్యులందరు లేఖనముల ప్రక రము యిచ్చుట అత్యవసరమని బోధిం చుట జరుగువలెను. పుచ్చుకొనుటకంటె యిచ్చుట ధన్యము అని యేసు చెప్పెను (అపో.కా. 20:35). మనము దేవుని రాజ్యమును మొదట వెదుకవలెనని క్రీస్తు చెప్పెను (మత్తయి 6:33). అనగా మనము కానుకలనిచ్చునపుడు ఆయన రాజ్యమును మొదట గమనించవలెనని యర్థము. మాసిదోనియలోని క్రైస్తవులు

తమ శక్తి కొలదికంటె ఎక్కువ యిచ్చిరి గనుక వారు కొనియాడబడిరి. అన్నిటి కంటే ముందుగా వారు తమ్మును తాము దేవుని కర్పించుకొనిరి.

ఒక బీద విధవరాలు తనకు కలిగి నదంతయు ఎట్లు యిచ్చెనో నీకు జ్ఞాపకము న్నదా? అననీయ, సప్పీరాలు వారు యిచ్చుచున్న దానిని గూర్చి అబద్ధమాడగా ఎట్లు తమ ప్రాణములను కోల్పోయిరో జ్ఞాపకమున్నదా ? (అపో.కా. 5:1-11). ఒకడు దేవునికి ఇయ్యవలసినది ఇయ్యక పోతే అతడు దేవుని నుండి దొంగిలించి నయట్లగునని లేఖనములు బోధించు చున్నవి. దేవుడు కానుకలు యిచ్చుటలో తన ప్రజలతో యిది వరలో చేసినట్లు ఇప్పుడు కూడ చేసిన యెడల యేమ గును? మనలో ఎంత మంది జీవించ గలరు ?

నేటి సంఘము ఎక్కువపని చేయ వలెను. లోకమున కంతటికిని సువార్తను బోధించు బాధ్యత అది యెక్కువ కలిగి యున్నది. ఆ పనిని జరిగించుటకు ఎక్కువ ధనము అవుసరమై యున్నది. గనుక సంఘము తన పనిని నిర్వర్తించులాగున నీవు, నేను క్రైస్తవులవలె ఎక్కువ ఈయవలెను. మనందరము లేఖనముల ప్రకారము ఇచ్చిన యెడల లోకమున కంతటికిని సువార్త బోధించుటకు కావలసి నదానికంటె ఎక్కువ సొమ్ము సంఘములో యుండును.

- జె.సి. ఛోట్

## పేతురు భార్య నమ్మకమైన సహచరి
## ( Mrs. Peter, a faithful companion)

పేతురు భార్యను గూర్చి లేఖనాల్లో యేమీ చెప్పబడలేదు. గనుక ఆమెనుండి యేమి నేర్చుకోగలము? అయితే నేనొక వాక్యోపదేశకూటమునకు వెళ్లగా ఒకామె ఒక్కడ ఆమెను గూర్చి బోధించగా విని ఆశ్చర్యపోయాను. ఆమెను గూర్చి నేర్చు కొందాము.

వ్యక్తిత్వాన్ని గూర్చిన పఠనము:
మత్తయి 8:14: మార్కు 1:30: లూకా 4:38 :

పేతురు యొక్క అత్త జ్వర పీడితు రాలై స్వస్థత పొందుటను గూర్చి మూడు సువార్తలలో చెప్పబడి యున్నది. పేతురు వివాహితుడని గ్రహించుకొన గలము. మరియు పేతురు అత్తను గూర్చిన సందర్భ ము వివరించు లేఖనములనుండి ప్రయోజ నకరమైన జ్ఞానమును సంపాదించుకొన గలము.

కొండమీద ప్రసంగమును ముగిం చిన తరువాత యేసుప్రభువు కపెర్నహో

ముకు వెళ్ళినట్లు మత్తయి సువార్త తెలు కొంది. ఆ పట్టణము గలిలయ సముద్రమునకు వాయువ్య దిశగా యున్నది. కపెర్నహూము పేతురు, అంద్రెయ, యాకోబు, యోహానుల నివాస స్థానము. తదుపరి యేసు కూడ ఆ పట్టణవాసియై యుండినట్లు కూడా మనకగుపడును (మత్తయి 4:13; 2:1; 17:24). పేతురు యోహాను యింటికి వెళ్లక ముందు యేసుసమాజ మందిరములో బోధించుచుండెనని మార్కు సువార్త చెప్పుచున్నది. బైబిలు కాలములో సమిష్టి కుటుంబములుండుట అసాధారణ వాస్తవం యేమీ కాదు. ఆత్మీయ, సాంఘిక, రాజకీయ పరంగా తండ్రి కుటుంబ యజమాని. అతని ఆధీనములో అనేక కుటుంబములు సమిష్టిగా జీవిస్తూ యుండేవి.

యేసుతో యాకోబు యోహానులు కూడ పేతురు అత్తయింటికి వెళ్లినట్లు గమనించగలము (మార్కు 1:30). అంటే అయింటికి అతిథులు తరుచు వెళ్లేవారని గ్రహించుకోగలము. పేతురు యొక్క భార్య, అయింటనున్న మిగతా స్త్రీలుకూడ అతిథిసత్కారము చేయుట కలవాటు పడినవారు. పేతురు అత్త తీవ్రమైన జ్వరముతో బాధపడుచున్నదని ఆ కుటుంబసభ్యులు యేసుకు తెలియజేసారు. ఆత్మీయ, భౌతిక రోగములను బాగుచేయు గొప్ప వైద్యుడగు యేసు ఆమె యొద్దకు వెళ్లి ఆమెను ముట్టి బాగుచేసెను. వెంటనే ఆమె లేచి యింటనున్న అతిథులకు ఉపచారము చేసెను. యేసును ఆయన శిష్యులును చేసిన అద్భుతములన్నీ యదార్థములు. స్వస్థత తక్షణమే, సంపూర్తిగా కలిగెను. అట్లు బాగుపడిన వారు పదే పదే వైద్యుని దగ్గరకు వెళ్లనక్కరలేదు. వారు చేసిన అద్భుతాలన్నీ యదార్థములే, నకిలీలేమీ కావు.

**1 కొరింథీ 9 : 5 :**

పేతురుకు భార్య యున్నట్లున్న మరియొక లేఖన భాగము 1 కొరింథీ 9:5. పౌలు తన అపొస్తలత్వమును సమర్థించుకొనుచు అపొస్తలునిగా తన హక్కును గూర్చి చెప్పుకొనిన సందర్భములో ఈ లేఖన భాగము కనబడును. బోధకుడు తన పని నిమిత్తము జీతమునకు పాత్రుడని పౌలు వక్కాణించుచుండెను. మరియు వివాహితుడైన బోధకునికి తన భార్యను పోషించుకొన వీలుగా తగినంత ఆర్థిక సహాయమవుసరము. తాను కూడ పెండ్లి చేసికొని, తన భార్యను వెంటబెట్టుకొని తిరుగుటకు పేతురువలెను, మిగతా సహోదరుల వలెను తనకు కూడ అధికారమున్నదని చెప్పుటకు పౌలు పేతురు భార్యను ఉదాహరణముగా చూపించెను. అయితే పౌలు అవివాహితుడిగానే యుండి కొరింథులోడేరాలు కుట్టుకొనుచు, సంఘమునకు భారముగా

యుండకుండు నిమిత్తము తన జీవనోపాధి సంపాదించుకొనెను (1 కొరింథీ 9:18).

పెండ్లికాని స్త్రీలు తమతో ప్రయాణము చేయుటకు అపోస్తలులు ప్రోత్సహించ లేదు. అది యుక్తము కాదు. నశించిన వారిని రక్షించుటకు అనవసరమైన అవరోధములు అది కల్పించును. నాటి అపోస్తులుల వలెనే నేడు మనమును మన క్రియలన్నిటిలో నిష్కపటముగను పరిశుద్ధముగను యుండాలి.

**నేర్చుకొనదగిన సూత్రములు:**

**పేతురు యొక్క శ్రీమతి ఒక సంఘ పెద్ద భార్య :**

అపొస్తులుడైన పేతురు సంఘ పెద్దలలో ఒకడు (1పేతురు 5:1). గనుక అతని శ్రీమతి ఒక సంఘపెద్ద భార్య అన్న మాట. 1తిమోతి 3:1–11లో ఒక పెద్దగా, అధ్యక్షునిగా యుండుగోరు వాడు ఏకపత్నీ పురుషుడును మితానుభవుడును, మర్యా దస్థుడును, అతిథిప్రియుడును బోధింప తగినవాడునై యుండి మద్యపానియుకొట్టు వాడును కాక సాత్వికుడును జగడమాడని వాడును ధనాపేక్ష లేని వాడునై యుండి, సంపూర్ణ మాన్యత కలిగి తన పిల్లలను స్వాధీన పరచుకొనుచు తన యింటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. మరియు సంఘమునకు వెలుపటి వారిచేత మంచి సాక్ష్యము పొందిన వాడై యుండవలెను. నమ్మకమైన మంచి భార్యలేని వానికి ఈ లక్షణములు అలవరచుకొనుట కష్టము. అట్టివాని భార్య కూడ తగిన రీతిగా తన జీవితమును జీవించును. ఒకని భార్యకు మంచి పేరు లేని యెడల అతడు సంఘ పెద్దగాతన బాధ్యతలు నిర్వర్తించగలడా?

**పేతురు భార్య అతిథి ప్రియురాలు :**

పేతురు అత్త అతిథులకు ఉపచారము చేసినట్లు బైబిలులో చెప్పబడినను, పేతురు భార్యయు, ఆయింటనున్న మిగతా స్త్రీలును ఆ ఉపచార క్రియలో సహాయపడియే యుందురు. అతిథి సత్కారమును గూర్చి పేతురు భార్య తన తల్లి దగ్గర నేర్చుకొని యుండును. అతిథులకు ఉపచారము చేసిన సందర్భాలు బైబిలులో అనేకము లున్నవి. శారా, మార్త, లూదియ, సారెపతు విధవరాలు, షూనేమీయురాలు, జక్కయ్య, ఫీబె మరియు మంచి సమరయుడు మొ॥గు వారు.

పెద్దలుగా యుండ గోరువారు అతిథిప్రియులై యుండాలి. ( 1 తిమోతి 3:2). అంటె పెద్దలు అతిథులను, క్రొత్తవారిని సత్కరించువారై యుండాలి సంఘ సహాయమునకు అర్హతగల విధవరాలు "పరదేశులకు ఆతిధ్యమిచ్చి పరిశుద్ధుల పాదములు కడిగి, శ్రమ పడువారికి సహాయముచేయునదై" యుండాలని 1 తిమోతి 5:10లో పౌలు చెప్పాడు. "సణుగుకొనకుండ ఒకనికి

ఒకడు అతిథ్యము చేయుడి” యని 1 పేతురు 4:9లో వ్రాయబడి యున్నది. పరదేశులను, సహోదర సహోదరీలను ప్రేమించి సత్కరించుట అతిథ్యమగును.

ఆధునిక కాలములో ఆతిథ్యపు టలవాటు క్షీణించుచున్నది. స్త్రీలు ఉద్యోగము చేయుట, గృహానికి వెలుపల పని చేయుట బిడ్డలయొక్క పనిలో నిమగ్నులై యుండుట, అనేక భోజన హెూటళ్లు వగయిరాలుద్భవించుట మొ॥గు వాటివలన ఈ సద్గుణము క్షీణించుచున్నది. తదుపరి వినోదకార్య క్రమాలకు హాజరపుట, పరుల సదుపాయము కంటె నా సంతోషమే ముఖ్యము అనే తలంపుల వలన కూడ ఈ సద్గుణము మసకబారి పోవుచున్నది. బైబిలు కాలములో కంటే నేడు అతిథులకు సదుపాయము కల్పించుట చాల సులభము. గనుక అతిథి సత్కారము చేయు కళను పునరుద్ధరించుటకు మనము యత్నించాలి. దానిని మన కుమార్తెలకు నేర్పించాలి. మన మిత్రులకు, సంఘ సభ్యులకు మన తలుపులు తెరిచి యుంచాలి. వారిని తరచు మన గృహాలకు భోజనానికి ఆహ్వానించాలి, వారి సహవాసమును నిజముగా ఆనందించాలి. యిట్టి పరిచర్య చేయు దేవుడిచ్చు తరుణములను నీవు వినియోగించుచున్నావా?

అతిథి సత్కారములు చేయాలని ఆజ్ఞాపింపబడినందున కాదుగాని, ప్రేమతో దానిని చేయాలి. పేతురు యొక్క భార్యవలె అతిథి సత్కారము చేయుటకు ఆసక్తి గలిగియుందాము. సోదర సోదరీలకు, పరదేశులకు పరిచర్య చేద్దాము.

**పేతురు యొక్క భార్య ఒక మిషనరీ :**

సువార్త పరిచర్యలో తన భర్తతో పాటు ప్రయాణము చేయుచుండగా పేతురు యొక్క భార్య అతనిని అనేక విధములుగా ప్రోత్సహించి యుండవచ్చును. సంఘపెద్దగా, మిషనరీగా బాధ్యతలను మోయుచుండగా పేతురుకు ప్రోత్సాహం అవుసరం. ఆమె అతనికి అవుసరమైన మాటలను చెప్పుచు యుండేది. నేటి క్రైస్తవ స్త్రీలు తమ భర్తలకు ప్రోత్సాహ కారకులై యుండాలి. భర్తలు దేవునినెరుగని వారితోను, అపరిపక్వమైన క్రైస్తవులతోను పనిచేయుచుండగా వారి యొక్క నిస్పృహలను, నిరుత్సాహమును క్రైస్తవ స్త్రీలు గ్రహించుకోవాలి; తగిన రీతిగా వారిని ప్రోత్సహించాలి. మంచి సలహాలు నివ్వాలి. అప్పుడప్పుడు మనం దరం నిరుత్సాహానికి లోనగుతాము. మనందరికీ ప్రోత్సాహమవుసరము.

ప్రోత్సాహకారిగా యుండుట ఎట్లో మనం బర్నబా నుండి నేర్చుకోగలము. పౌలు క్రైస్తవుడయిన తరువాత బర్నబా అతనిని యెరూషలేముకు తీసికొని వెళ్లాడు, అపొస్తలులకు పరిచయం చేసాడు. (అపొ. కా. 9: 26-27). పౌలు యొక్క గతాన్ని బట్టి మిగతా క్రైస్తవులు

భయపడగా బర్నబా పౌలుదరపున నిలుచుండి, అతడు నీతిమంతుడైన బోధకుడని పరిచయం చేసాడు. మార్కు పని విషయంలో తడబడగా బర్నబా అతనికి మరొక తరుణం అనుగ్రహించి సువార్త యాత్రలో మరల తీసికొని వెళ్లాడు (అపో.కా. 12:25; 13:13; 15:39).

నశించిన వారికి పరలోక మార్గమును బోధించే తరుణములు పేతురు భార్య కలిగి యుండెను. తన భర్తతో ప్రయాణం చేయుచు ఆమె అనేకులకు ముఖ్యముగా స్త్రీలకు బోధించియుండవచ్చును. స్త్రీలకు బోధించు తరుణములు పేతురు కన్న ఆమెకే ఎక్కువ వుండెను. గనుక ఆమె దేవుని వాక్యమును బాగుగా నేర్చు కొనినదై యుండవచ్చును.

నేటి క్రైస్తవ స్త్రీలు ఇతరులకు బోధించునట్లు బైబిలు జ్ఞానమును కలిగి యుండాలి. బెరెయలోని క్రైస్తవులవలె మనము అనుదినము లేఖనాలను పరిశోధించాలి (అపో.కా. 17:11). "దేవుని యెదుట యోగ్యునిగాను సిగ్గు పడనక్కరలేని పనివానిగాను సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్నునీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమో 2:15).

దేవుని వాక్యమును స్థానికంగాను, యితర ప్రాంతాలలోను బోధించుటకు కొందరు స్త్రీలు తమ భర్తలను ప్రోత్సహించరు. అట్టి అవకాశములు వచ్చినా, వారు తమ బంధుమిత్రుల నుండి దూర ప్రాంతములకు సువార్త నిమిత్తము వెళ్లుటకు ఇష్టపడరు. ఒకవేళ వెళ్లినా, వారు విడిచి వచ్చినవారిని గూర్చి నిట్టూర్పులూడుస్తారు. లోతు భార్య వెనుకకు తిరిగి చూచినప్పుడేమి జరిగిందో నీకు జ్ఞాపకమున్నదా? ఆమె మిత్రులను, బంధువులను ఆస్థిని వదిలి వెళ్లింది. వెనుకకు తిరిగి చూచి ఉప్పు స్థంభమయ్యింది (ఆది.కా. 19:1-26). ఆయన కంటె తన కుటుంబాన్ని ప్రేమించువాడెవడు ఆయనకు పాత్రుడుకాడని యేసు ప్రభువు చెప్పారు (మత్తయి 10:37 -38).

ఇంకా కొందరు తమ భర్తలును ప్రసంగాలు తయారు చేసికొనుచు బైబిలును చదువుచు, రోగులను దర్శించుచు గడుపు సమయాన్ని గూర్చి వ్యసనపడుదురు. భర్తలుగా, తండ్రులుగా బోధకులు తమ కుటుంబ బాధ్యతలు నిర్వర్తించాలి. ఈ బాధ్యతలను వారు సమపాళ్ళలో కొనసాగించాలి. అందుకే "దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనీయక సద్వినియోగము చేసికొనుచు అజ్ఞానులవలె గాక జ్ఞానులవలెనడుచు కొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" యని అపో. పౌలు హెచ్చరించాడు (ఎఫెసీ 5:15-16). యితరులను క్రీస్తు నొద్దకు తెచ్చుటకు

మనం అన్ని తరుణములను వినియోగిం చుకోవాలి.

బోధకులే గాకుండా భక్తిపరులైన అనేకమంది సువార్త బోధించునట్లు తమ భార్యలచే ప్రేరేపింపబడరు. ఈ స్త్రీలు తమ భర్త సమయాన్ని ఎక్కువ కోరుకొంటారు. అవివేకమైన కోరికలు కలిగియుంటారు. తమ భర్త సమయం దేవుని మహిమార్ధమై వెచ్చింపబడేటట్లు చూచుకోవాలి.

నీవు ఇట్టి రకమైన భార్యలలో ఒక దానివా? దేవుని పనిచేయకుండా నీ భర్తకు నీవు అభ్యంతర కారకురాలివా? దేవుని పనిలో అతడు వెచ్చించు సమయాన్ని బట్టి వ్యసనపడుదువా? అట్లయితే, దయచేసి మారుమనస్సు నొందుము. నీవు నీ భర్తతో ఎక్కువ కాలము గడపాలనుకొంటే అతనితో కూడ పేతురు భార్యవలె ప్రయాణించుము, రోగులను దర్శించుము, స్త్రీలకు బోధించుము. ఆవిధంగా నీవు బలమైన దేవుని సేవకురాలవగుదువు. మీరిద్దరు కలిసి అనేకులను క్రీస్తులోనికి రక్షణలోనికి నడిపించగలరు.

నీవు పేతురు భార్య వంటి దానవా? నీభర్తను ప్రోత్సహించు దానవా? యితరులను కూడ ప్రోత్సహించుచున్నావా? నీ బంధుమిత్రులకు, పర దేశులకు ఆతిధ్య మిచ్చెదవా? నశించిన వారిని రక్షించుటకు కృషి చేయుచున్నావా? అట్లయితే నీ సత్క్రియలను బట్టి నిన్ను అభినందించుచున్నాను.

– బోని రష్మోర్

## నేడు అద్భుత స్వస్థతలు జరుగుచున్నవా?
## (Are miracles of Healing done Today ?)

మొదటి శతాబ్ధములో అద్భుత స్వస్థతలు యదార్ధముగా జరిగెను. నేడు 'భక్తుల' ద్వారా జరిగే అద్భుత స్వస్థతలు యేమీ లేవు. యేసు ప్రభువు నిజముగా దేవుని కుమారుడని మనము నమ్మునట్లును అపొస్తలులు కూడ దేవుని యధికారము పొందినవారని నిర్ధారించుటకును దేవుడు వారికి అద్భుత వరములననుగ్రహించెను (యోహాను 20:30-31; మార్కు 16:20). పరిశుద్ధాత్మావేశము వలన అపొస్తలులు దేవుని చిత్తమును పరిపూర్ణముగా మనకు రికార్డు చేసి యిచ్చిరి (1కొరింథీ 2:12-13). అపొస్తలులకును, వారు చేతులుంచిన వారికిని అద్భుతములు చేసే శక్తి ఈయబడెను (అపొ.కా. 2: 4 ;8: 17). అందరికీ ఈ అద్భుత వరములు ఇయ్యబడలేదు (అపొ.కా. 8:18-19).

క్రొత్తనిబంధన సంపూర్తిగా వ్రాయబడినప్పుడు అద్భుతములు

నిలిచిపోయెను. 1కొరింధీ 12, 13 అధ్యాయములు ఈ అద్భుతవరములను గూర్చి తెలియజేస్తాయి. అవి తాత్కాలిక మైనవని అవి తెలియజేస్తాయి. "పూర్ణ మైనది వచ్చినపుడు పూర్ణము కానిది నిరర్థకమగును" (1కొరింధీ 13:10). 'పూర్ణము కానిది' ఈయద్భుత వరములు. 'పూర్ణమైనది' క్రొత్తనిబంధన (యాకోబు 1:25, 2 తిమో 3:16-17). బైబిలు క్రీ॥శ 100వ సంవత్సరములోపు సంపూర్తి చేయబడెను. తదుపరి అద్భుతములు నిలిచిపోయెను. చారిత్రాత్మకముగా దీని నిర్ధారించవచ్చును. దేవుని వాక్యమును బయలు పరచి దానిని స్థిపరచుటకు అద్భుతములు అవుసరమాయెను. క్రొత్తనిబంధన ఇయ్యబడి, స్థిరపరచ బడినప్పుడు, రికార్డు చేయబడినప్పుడు, అద్భుతముల అవుసరతయిక లేక పోయెను.

క్రీస్తు కాలములోను, అపొస్తలుల కాలములోను అద్భుతములు యదార్థము గా జరిగెను. వారి శత్రువులు సయితము అవి నిజముగా జరిగెనని అంగీకరించిరి (అపొ.కా. 4:14-16).

యేసుక్రీస్తును, ఆయన అపొస్తలు లును వారి యొద్దకు వచ్చిన వివిధ రోగులనందరిని అద్భుతముగా స్వస్థ పరచిరి (అపొ.కా. 5:16). నేటి 'స్వస్థత వరము గల భక్తులు' ఎవరినీ బాగు చేయడంలేదు. సరిగదా ఆరోగులు పదే పదే వారి యొద్దకు స్వస్థత కొరకు వస్తు యుంటారు.

నేటి 'ఆధునిక భక్తులు, వారియొద్ద స్వస్థతనొందని వారిలో తగినంత విశ్వాసము లేదని ఆరోగులనే నిందింతురు. క్రొత్తనిబంధనకాలములో అద్భుత రీతిగా స్వస్థతనొందిన వారిలో 36 సందర్భము లలో మాత్రమే వారికి విశ్వాసమున్నట్లు గమనించగలము.

బైబిలులో జరిగిన అద్భుతములు వాక్యమును స్థిరపరచుటకు జరిగించ బడెను. అవి కేవలము స్వస్థత కొరకే జరిగించబడలేదు. పౌలు, తిమోతి, త్రోఫిములు కూడ రోగులే, అయినను వారికొరకు అద్భుతములు జరిగించబడ లేదు (2 కొరింధీ 12:7-10; 1తిమో 5:23, 2తిమో 4:20).

స్వస్థత నొంద గోరినవారి నుండి అపొస్తలులు ఎన్నడు ధనము నాశించ లేదు. నేటిభక్తులు చేసేదంతా ధానార్జ నకొరకే.

అపొస్తలులు మూగ వారిని, గ్రుడ్డివారిని, కుష్ఠరోగులను, అవిటివారిని, పక్షవాయువు గలవారిని తక్షణమే బాగు చేసిరి. వారు దయ్యములను వెళ్ల గొట్టిరి,చనిపోయిన వారిని బ్రదికించిరి. ఇట్టివేమీ నేటి 'స్వస్థత భక్తులు' చేయరు, చేయలేరు.

కొందరు రోగులు వీరి దగ్గరకు వెళ్లుట వలన స్వస్థతపడుదురు. అది ఆభక్తుల ప్రభావము యేమీకాదు. మనకు సంభవించే రోగములు, బాధలు కాలాన్ని బట్టి నయమగును. దేవుడు మన శరీరాన్ని అట్లు చేసారు. స్వల్పనొప్పులు, రోగములు వాటికవే ప్రకృతి సహజముగా నయమవుతాయి. సరిగదా మనకు సంభవించే వ్యాధి బాధలు 85 శాతం మానసికమైనవే, అంటే మానసిక ఆందోళన వలన, ఒత్తిడి వలన సంభవించినట్టివే. అట్టి సందర్భములో ఈ 'అద్భుతవైద్యుడు' ఆరోగిని దేవుడు స్వస్థపరిచాడని నమ్మించగలిగితే, దానిని బట్టి ఆరోగిబాగుపడినట్లు భావిస్తాడు. అందువలననే "Power of mind over matter అనే మాటను మీరు వినియే యుంటారు.

మానసిక ఆరోగ్యము కొరకు విశ్వాసము, పట్టుదల అత్యవసరము అందువలన రోగి యైనవాని మానసిక స్థితి కుదుటపడుటవలన అతడు బాగు పడవచ్చును. అయితే అది అద్భుతము కాదు. సైకాయాట్రిస్టులు, హిప్నోటిస్టులు, కౌన్సెలర్లు రోజూ చేసే పనే యిది. వారేమీ స్వస్థతావరముగల వారమని ప్రకటించుకోరు. స్వస్థత వరము గల వారమని చెప్పుకొనే వారందరు మోసగాళ్లుకాదు. వారు సత్యవాక్యమును సరిగ గ్రహించక అపవాది చేత మోసగించబడినవారు (2 థెస్స 2:11-12).

- జాన్ వేడే

## ఎవరు ఎవరికి లోబడి యుండాలి

**1. పిల్లలు :-**

ఎ) పిల్లలారా ప్రభువునందు మీ తల్లి దండ్రులకు విధేయులైయుండుడి. ఇది ధర్మమే. నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని, తల్లిని సన్మానింపుము. అప్పుడు నీవు భూమిమీద దీర్ఘాయుష్మంతుడగుదువు. ఇది వాగ్దానముతో కూడిన ఆజ్ఞలలో మొదటిది. (ఎఫె 6:1-2, ద్వితి 5:16).

బి) జ్ఞానముగల కుమారుడు తండ్రిని సంతోషపరచును బుద్ధిలేని కుమారుడు దు:ఖపుట్టించును (సామె 10:1-2).

**2. తండ్రులు :-**

ఎ) తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను, బోధలోను వారిని పెంచుడి (ఎఫె 6:4).

బి) బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడును దానినుండి తొలగిపోడు (సామె 22:6).

సి) తండ్రి శిక్షించిన కుమారుడు జ్ఞానము గలవాడగును. అపహాసకుడు గద్దింపునకు లోబడడు (సామె 13:1).

(టైటిల్ 3వ పేజీలో)

**భార్యలు :-**

ఏ) స్త్రీలారా, (ప్రభువునకువలె) మీ సొంత పురుషులకు లోబడి యుండుడి (ఎఫె 5:22)

బి) ఆ ! ప్రకారము శారా అబ్రాహామును యజమానుడని పిలుచుచు అతనికి లోబడియుండెను (1పేతురు 3:5-6)

సి) జ్ఞానవంతురాలు తన ఇల్లు కట్టును. మూఢురాలు తన చేతులతో తన ఇల్లు ఊడబెరుకును (సామె 14:1)

**పురుషులు :-**

ఏ) పురుషులారా, మీ భార్యలను ప్రేమించుడి. అటువలె క్రీస్తు కూడా సంఘమును ప్రేమించి దానికొరకు తన్నుతాను అప్పగించుకొనెను.............. అటువలెనే పురుషులు కూడా తమ సొంత శరీరమువలె తమ భార్యలను ప్రేమింపబద్ధులై యున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించుకొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించువాడెవడును లేడు కాని ప్రతివాడును దానిని పోషించి సంరక్షించుకొనును. (ఎఫె 5:25 -30).

బి) అటువలెనే పురుషులారా, జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారై యున్నారని యెరిగి, ఎక్కువ బలహీనమైన ఘటమని సన్మానించి, మీ ప్రార్థనలకు అభ్యంతరము కలుగకుండునట్లు, జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి. (1 పేతురు 3:7).

సి) భార్యదొరికిన వారికి మేలు దొరికెను. అట్టివాడు ప్రభువు వలన అనుగ్రహము పొందినవాడు. (సామె 18:22)

**దాసులు :-**

ఏ) దాసులారా, యథార్థమైన హృదయముగలవారై భయముతోను, వణుకుతోను, క్రీస్తువలె, శరీరవిషయమై మీ యజమానులైన వారికి విధేయులై యుండుడి. మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు, కంటికి కనబడుటకే కాక, క్రీస్తుదాసులమని యెరిగి, దేవుని చిత్తమును మనఃపూర్వకముగా జరిగించుచు, మనుష్యులకు చేసినట్లు కాక ప్రభువునకు చేసినట్టే ఇష్టపూర్వకముగా సేవచేయుడి. దాసుడైనను, స్వతంత్రుడైనను మీలో ప్రతివాడు ఏ సత్కార్యము చేయునో దాని ఫలము ప్రభువు వలన పొందునని మీరెరుగుదురు. (ఎఫె 6:5 -8)

బి) దాసులైన వారు అన్ని విషయముల యందు మన రక్షకుడగు దేవుని ఉపదేశములను అలంకరించునట్లు తమ యజమానులకు ఎదురు మాట చెప్పక, ఏమియు అపహరింపక, సంపూర్ణమైన మంచి నమ్మకమును కనపరచుచు. అన్ని కార్యముల యందు వారిని సంతోషపెట్టుచు, వారికి లోబడియుండవలెను. (తీతు 2 : 9 -10).

సి) అదిపతులకు, అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెననియు, ప్రతి సత్కార్యము చేయుటకు సిద్ధపడి యుండవలెననియు, మనుష్యులందరియెడల సంపూర్ణమైన సాత్వికమును కనపరచుచు, ఎవరిని దూషింపక, జగడమాడని వారును శాంతులై యుండవలెననియు వారికి జ్ఞాపకము చేయుము. (తీతు 3:1 -3).

**యజమానులు :-**

ఎ) యజమానులారా, మీకును వారికిని యజమానుడైనవాడు పరలోకమందున్నాడనియు, ఆయనకు పక్షపాతము లేదనియు ఎరిగినవారై, వారిని బెదిరించుట మాని, అప్రకారమే వారియెడల ప్రవర్తించుడి. (ఎఫె 6:9; కొలస్స 4:1).

**- జేకబ్ దేవానంద్, హైదరాబాదు**

RNI Regd. No. 69973/98
Postal Regd. No. AP-VM/KD/02/2012-2014

To

From:
SATYA VAKKU
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam. Printed by him at Satya Vani Publication, Sambamurthy St., Kakinada - 533 004